పవర్ కట్..!



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాపు రామచంద్రారెడ్డి

కణేకల్లు, ఫిబ్రవరి 13: వైసీపీ రెబెల్ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ప్రసంగిస్తుండగా, ఆసరా సభలో కరెంటు పోయింది. ఉద్దేశపూర్వకంగా కరెంటు తొలగించి, తనను అవమానించారని కాపు ఆగ్రహం వ్యక్తం చేశారు. కణేకల్లులో మంగళవారం ఆసరా సభ నిర్వహించారు. ఎమ్మెల్యే హోదాలో కాపు మాట్లాడుతుండగా.. మైక్ కట్ అయ్యింది. ఆ వెంటనే కొంతమంది వైసీపీ నాయకులు మెట్టు గోవిందరెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అని నినాదాలు చేశారు. దీంతో కాపు మండిపడ్డారు. కవ్వింపు చర్యలు సరికాదని, నియోజకవర్గంలో మరో మూడు ఆసరా సమావేశాలు ఉన్నాయని తాను ఏంటో ఆ సమావేశాలలో చూపిస్తానని హెచ్చరించారు. సీఎంఓ నుంచి తనకు ఫోన్ చేసి ఆహ్వానిస్తున్నారని, ఎప్పుడు ఏమైనా జరుగవచ్చని అన్నారు. ఆసరా సమావేశంలో తనపై దాడి చేస్తామని సోషల్ మీడియాలో కొందరు పోస్టులు పెట్టారని, తాను ఎవరికీ భయపడనని అన్నారు. కాపు, మెట్టు వర్గీయులు గొడవకు దిగుతారన్న సందేహంతో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు.

దీపం ఉండగానే.. కబ్జా..!





ప్లాట్లు వేసేందుకు సిద్ధం చేసిన రాళ్లు..



ఆక్రమించిన భూమికి ఫెన్సింగ్

ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. అధికారులు బదిలీల హడావుడిలో ఉన్నారు. ఇదే అదనుగా అధికార పార్టీ నాయకులు కొందరు దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకుంటున్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేయడం మొదలుపెట్టారు. గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని లచ్చానుపల్లి రోడ్డులో జగనన్న లే అవుట్ ఉంది. దీని సమీపంలో సర్వే నంబర్ 644-3లో 4.60 ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ నేతలు ఆక్రమించారు. యంత్రాలతో కంపచెట్లను తొలగించి, చదును చేస్తున్నారు. ప్లాట్లు వేసేందుకు రాళ్లను సిద్ధం చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో అధికార పార్టీవారికి రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. సర్వే నంబర్ 643లో రెండు ఎకరాల పోరంబోకు భూమిని మరో వ్యక్తి ఆక్రమించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. కబ్జాల గురించి తహసీల్దారు భారతిని వివరణ కోరగా, విచారించి చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలోనూ ఈ భూముల కబ్జాకి ప్రయత్నాలు జరిగాయి. అవి ప్రభుత్వ భూములని గుర్తించిన గత తహసీల్దారు.. కబ్జాదారులకు నోటీసులు ఇచ్చారు. దీంతో కొన్నాళ్లు మౌనంగా ఉండి, తహసీల్దారు బదిలీపై వెళ్లగానే పనులను తిరిగి ప్రారంభించారు. - గుత్తి

వ్యవసాయానికి ఏడు గంటలే..!

పంటలు ఎండుతున్నాయని రైతుల ఆవేదన

విద్యుత్ శాఖ అధికారిని నిలదీసిన అన్నదాత



నెర్రెలు చీలిన భూమి.. ఎండిన వరిపంట



ఎండిపోయిన వరిపంటను చూపిస్తున్న రైతు బ్రహ్మయ్య

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 13: వ్యవసాయ విద్యుత్ సరఫరాను కుదించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తొమ్మిది గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని వైసీపీ ప్రభుత్వం చెబుతోంది. దీన్ని ఏడు గంటలకు కుదించారు. విద్యుత్ సమస్య తలెత్తుతుందని ముందుగానే అధికారులు చెప్పి ఉంటే తాము పంట విస్తీర్ణాన్ని తగ్గించుకునేవారమని రైతులు వాపోతున్నారు. చెప్పాపెట్టకుండా విద్యుత్ సరఫరాను నిలిపేస్తే తమ పంటలు ఎండిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై బొమ్మనహాళ్ మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన రైతు బ్రహ్మయ్య విద్యుత్ శాఖ అధికారికి ఫోన్ చేసి నిలదీశారు. ఒకేసారి రెండు గంటలు తగ్గిస్తే తన పంటల పరిస్థితి ఏమిటని ప్రశ్నించాడు. ఈ రైతు ఆవేదన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. 'నేను పది ఎకరాలలో వరి, వేరుశనగ సాగు చేశాను. ఇప్పుడు ఏడు గంటల విద్యుత్ ఇస్తే ఎలా? ముందే ఈమాట చెప్పి ఉంటే నేను ఐదు ఎకరాల్లోనే పంట సాగుచేసేవాడిని కదా..?' అని విద్యుత్ శాఖ అధికారిని ప్రశ్నించారు. డి.హీరేహాళ్ మండలంలో తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారని, తమ మండలంలోని ఉప్పరహాళ్ సబ్‌స్టేషన్ కింద ఏడు గంటలకు ఎందుకు కుదించారని ప్రశ్నించాడు. ఒక్కో మండలానికి ఒక్కో విధంగా ఎలా సరఫరా చేస్తారని నిలదీశాడు. కొద్దిరోజులు మాత్రమే ఏడు గంటలు ఇస్తామని ఆ అధికారి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే ఇచ్చే ఏడు గంటల్లో కూడా కరెంట్ కోతలతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు మండిపడుతున్నారు. విద్యుత్ సరఫరాలో కోత విధిస్తే రబీ పంటలు ఎండిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





టీడీపీ విజయ దుందుభి ఖాయం

ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం, కేశవరెడ్డి

బీకేఎస్‌లో టీడీపీ నియోజకవర్గ శంఖారావం

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 13: సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం పునాదుల మీద పుట్టిన టీడీపీ.. వచ్చే ఎన్నికల్లో విజయ దుందుబి మోగిస్తుందని పార్టీ ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి అన్నారు. నారా లోకేశ్ చేపట్టిన శంఖారావానికి మద్దతుగా బుక్కరాయసముద్రంలో మంగళవారం శింగనమల నియోజకవర్గ శంఖారావం నిర్వహించారు. ఆరు మండలాల నుంచి వచ్చిన వేలాది మంది కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం నుంచి వేదిక వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విసభ్యకమిటీ సభ్యులు మాట్లాడుతూ, సెంటిమెంట్‌గా వస్తున్న ఈ నియోజకవర్గంలో 40 వేల మెజార్టీతో టీడీపీ అభ్యర్థి గెలుపు ఖాయమని అన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారని అన్నారు. వారి దౌర్జన్యాలు, దోపిడీలు, హత్యలు, భూకబ్జాలతో సామన్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ చేశారో చూపించాలని ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు సవాలు విసిరారు. అభివృద్ధి గురించి చర్చకు సిద్ధమని అన్నారు. సైకో సీఎం జగన్‌ను అధికారం నుంచి దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. నియోజకవర్గ పరిధిలో పార్టీ సమస్యలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళతామని, త్వరలోనే ఇన్‌చార్జిని నియమిస్తామని నియోజకవర్గ పరిశీలకులు గుర్రప్పనాయుడు అన్నారు. సరైన అభ్యర్థిని ఎంపిక చేస్తారని అన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులకు తగిన ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. వైసీపీకి చెందిన పలువురు దయ్యాలకుంటపల్లి గ్రామస్థులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గంజే నాగరాజు, మాజీ జెడ్పీటీసీ రామలింగారెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, ఆలం వెంకట నరసానాయుడు, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, డేగల క్రిష్ణమూర్తి, ఆవుల కిష్టయ్య తదితరులు ప్రసగించారు. మండల కన్వీనర్లు అశోక్, బాలరంగయ్య, పాండు, ఎర్రినాగప్ప తదితరులు పాల్గొన్నారు.



శంఖారావం బహిరంగ సభకు హాజరైన కార్యకర్తలు




ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నియోజకవర్గ నాయకులు

ఉల్లి రైతు ఆత్మహత్య

యాడికి, ఫిబ్రవరి 13: మండల పరిధిలోని కోనుప్పలపాడు గ్రామానికి చెందిన రైతు రామచంద్రారెడ్డి(35) అప్పుల బాధతో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రామచంద్రారెడ్డికి మూడు ఎకరాల పొలం ఉంది. తండ్రి సోమశేఖర్‌రెడ్డితో కలిసి కొన్నేళ్లుగా ఉల్లి పంట సాగుచేసేవాడు. దిగుబడి ఆశించిన స్థాయిలో రాక తీవ్రంగా నష్టపోయాడు. పెట్టుబడులు, కుటుంబం కోసం చేసిన అప్పులు రూ.7 లక్షలు దాటాయి. తీర్చే మార్గం తెలియక మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు యాడికిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

చెరువు నీటి తరలింపు ఆపండి

శింగనమల, ఫిబ్రవరి 13: శింగనమల చెరువు నుంచి తాము అనుమతి ఇచ్చేదాకా రోడ్డు పనులకు ట్యాంకుల ద్వారా నీటిని తరలించవద్దని ఇరిగేషన్ అధికారులు ఆదేశించారు. హైవే పనులకు శింగనమల చెరువు నీటిని అనుమతి లేకుండా వాడుకొంటున్నారు. దీనిపై సోమవారం ఆంధ్రజ్యోతిలో 'నిబంధనలకు నీళ్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. శింగనమల చెరువు మరువ కొమ్మ వద్ద నీటి ట్యాంకర్లను ఇరిగేషన్ జేఈ సాయిసాథ్ వెళ్లి మంగళవారం అడ్డుకున్నారు.





ఇదోరకం దందా..!





రీచ్ వద్ద ఆందోళనకు దిగిన ట్రాక్టర్, ట్రక్కు డ్రైవర్లు

ఇసుక దొరక్క.. వంతు కోసం క్యూలో నిలబడ్డ వాహనాలు కావివి. తక్కువ మొత్తానికి బిల్లు ఇచ్చి.. ఎక్కువ మొత్తం గుంజుతున్నందుకు నిరసనగా.. డ్రైవర్లందరూ ఏకమై ఇలా నిరసనకు దిగారు. బెళుగుప్ప మండలం వేపరాల వద్ద హగరి నదిలో ఇసుక రీచ్ ఉంది. ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇసుకను విక్రయిస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నా, ట్రాక్టర్ ఇసుకకు రూ.2,900 వసూలు చేసి.. బిల్లు మాత్రం రూ.2,375కే ఇస్తున్నారు. టిప్పర్ ఇసుకకు రూ.10,050 తీసుకుని, బిల్లు రూ.8,550 అని రాసిస్తున్నారు. ట్రాక్టర్‌పై రూ.525, టిప్పర్‌పై రూ.1,500 అదనంగా వసూలు చేస్తున్నారు. ఎంత చెల్లిస్తే అంతకు బిల్లు ఇవ్వాలని డ్రైవర్లు అడిగితే.. రీచ్‌లో ఉన్న సిబ్బంది నిరాకరిస్తున్నారు. దీంతో ఇసుక వినియోగదారుల నుంచి తాము అదనపు మొత్తాన్ని ఎలా వసూలు చేసుకోవాలని డ్రైవర్లు నిలదీశారు. బిల్లులో ఉన్న మొత్తాన్ని మాత్రమే వినియోగదారులు ఇస్తారని, దీనివల్ల తాము నష్టపోతామని అన్నారు. తమ చేతుల్లో ఏమీ లేదని, కంపెనీ నిర్వాహకులు ఇలా వసూలు చేయమని చెప్పారని రీచ్‌లో ఉన్న సిబ్బంది తేల్చిపోయారు. అధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని, అక్రమాలను అడ్డుకోవాలని డ్రైవర్లు డిమాండ్ చేశారు.

- బెళుగుప్ప





నేనున్నా..

కష్టాల్లో తోడుంటాం

నిజం గెలవాలి యాత్రలో నారా భువనేశ్వరి

చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన కుటుంబాలకు పరామర్శ

పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో పర్యటన

అడుగడుగునా ఘన స్వాగతాలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 'అధైర్య పడవద్దు.. తెలుగు దేశం పార్టీ మీకు అండగా ఉంటుంది. పార్టీ కోసం కష్టపడి ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను ఎప్పటికీ మరువదు. మీకు అండగా ఉంటామని చెప్పడానికే నేను మీ ఇంటి ముంగిటకు వచ్చా' అని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి.. బాధిత కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. వైసీపీ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులో భాగంగా నారా చంద్రబాబునాయుడిపై అక్రమ కేసులు పెట్టి, జైలుకి పంపిన సందర్భంలో వందలాది మంది పార్టీ కార్యకర్తలు మనస్తాపం చెంది, ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వారి కుటుంబాలను పరామర్శించేందుకు నారా భువనేశ్వరి మంగళవారం ఉమ్మడి జిల్లా పర్యటన నిమిత్తం వచ్చారు. బాధిత కుటుంబాలకు వెళ్లి, కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించి, ఓదార్చారు. శ్రీసత్యసాయి విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకున్న ఆమెకు ఉమ్మడి జిల్లా నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి ఆమె నేరుగా పుట్టపర్తి మండలం నిడిమామిడి గాజులకుంట గ్రామానికి చేరుకొని టీడీపీ కార్యకర్త మునిమడుగు బావయ్య కుటుంబాన్ని పరామర్శించారు. బావయ్య చిత్రపటానికి నివాళులు అర్పించిన ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. బావయ్య కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అతడి కుటుంబ సభ్యులకు రూ.3 లక్షల ఆర్థికసాయం చెక్కు అందజేశారు. ఓబుళదేవరచెరువు మండలం గాజుకుంటపల్లిలో మేకల రామచంద్ర కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అధైర్యపడవద్దనీ, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం రూ.3 లక్షల చెక్కు అందజేశారు. కదిరి పట్టణంలోని 8వ వార్డులో టీడీపీ కార్యకర్త మద్దిగల్ల ప్రకాష్ కుటుంబాన్ని పరామర్శించారు. తనకల్లు మండలం కొర్తికోటలో షేక్ బుడేన్ సాబ్, కదిరి రూరల్ మండలం ముష్టిపల్లిలో చంద్ర, తలుపులలో చిన్నకోట్ల మహేశ్వర కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతిచెందిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం వారికి మనోధైర్యం చెప్పారు. నారా భువనేశ్వరికి ఆయా గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, ప్రజలు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు.

భువనేశ్వరి పర్యటన కోసం..





సత్యసాయి ఎయిర్‌పోర్టు బయట అభివాదం చేస్తున్న నారా భువనేశ్వరి



కదిరిలో ప్రకాష్ కుటుంబ సభ్యులకు చెక్కు పంపిణీ చేస్తున్న భువనేశ్వరి





ఓడీసీ మండలం గాజుకుంటపల్లిలో బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇస్తున్న భువనేశ్వరి



పుట్టపర్తి మండలం గాజులపల్లిలో బావయ్య కుటుంబ సభ్యురాలిని ఓదారుస్తూ..



తలుపుల మండలం ఎగువపేటలో బాధితులతో మాట్లాడుతూ...

హాస్టల్ విద్యార్థినులతో మాటామంతి

కదిరి పట్టణంలోని 8వ వార్డులో బాధిత కుటుంబాన్ని పరామర్శించి వస్తున్న నారా భువనేశ్వరి అక్కడే ఉన్న బీసీ హాస్టల్ విద్యార్థులతో ఆప్యాయంగా మాటామంతి కలిపారు. వారితో కాసేపు మాట్లాడారు. వారిని దగ్గరకు తీసుకుని, ఏమి చదువుతున్నారు? హాస్టల్‌లో ఎలా ఉంది? బాగా చదువుకుంటున్నారా? భోజనం సరిగా పెడుతున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. వారితో కరచాలనం చేసి, ఫొటో దిగారు. దీంతో విద్యార్థులు ఆనందంలో మునిగిపోయారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని వారికి సూచించారు. ఆమె వెంట టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, టీడీపీ కదిరి ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సవిత, శింగనమల నేత బండారు శ్రావణి పాల్గొన్నారు.



భువనేశ్వరికి ఘన స్వాగతం

నిజం గెలవాలి యాత్రలో భాగంగా జిల్లాలో పర్యటిస్తున్న నారా భువనేశ్వరికి దారిపొడవునా ప్రజలు, కార్యకర్తల నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. ఆయా గ్రామాల్లో భువనేశ్వరిని చూసేందుకు మహిళలు పెద్దఎత్తున వచ్చారు. ఆమెకు హారతులు పట్టి, పూలజల్లుతూ అభిమానం చాటుకున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి బయటకి వచ్చే క్రమంలో వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు స్వాగతం పలికారు. మార్గమధ్యలో మామిళ్లకుంట క్రాస్, కప్పలబండ, బత్తలపల్లి, పెడబల్లి, నిడుమామిడి, కొట్లపల్లి గ్రామాల వద్ద భారీ జనాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె.. మహిళలు, వృద్ధులను పలకరిస్తూ.. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పెడబల్లి నుంచి ఊరూరా భువనేశ్వరికి స్వాగతం పలికారు. కొండకమర్ల, ఓబుళదేవరచెరువు, గాజుకుంటపల్లిలో మహిళలు, చిన్నారులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.



కదిరిలో...



మేడలెక్కిన అభిమానం..



ఎయిర్‌పోర్టులో నారా భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న టీడీపీ ముఖ్య నేతలు



విద్యార్థినులతో ...



జేఈఈ మెయిన్‌లో అనంత కుర్రాళ్ల ప్రతిభ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 13: దేశంలోని ప్రముఖ ఐఐటీలు, ఎన్‌ఐటీ సంస్థల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ (సెషన్-1) పరీక్షల్లో అనంతపురం విద్యార్థులు సత్తా చాటారు. జనవరి 24వ తేదీ నుంచి ఈ నెల 1వ తేదీ వరకూ దేశవ్యాప్తంగా పలు పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల ఫలితాలు సోమవారం రాత్రి విడుదలయ్యాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాల్లో పలువురు అనంతపురం జిల్లా విద్యార్థులు తమ సత్తా చూపారు. విద్యార్థులు ప్రతిభ చూపి మెరుగైన ర్యాంకులు సాధించారు. పలువురు విద్యార్థులు 99 శాతం పర్సంటైల్ సాధించారు.

99 శాతానికి పైగా పర్సంటైల్ సాధించిన విద్యార్థులు

నారాయణ విద్యార్థుల ప్రతిభ...

నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపారు. కళాశాల విద్యార్థులు శశికిరణ్ 99.89 పర్సంటైల్, మేఘన 99.64 పర్సంటైల్, పఠాన్ ఆసిం ఖాన్ (99.23), వనదీప్ (99.08), హరి చాణిక్యరెడ్డి (98.88), సిద్ధార్థరెడ్డి (97.85), శివప్రసాద్ (97.70), భానుప్రకాష్ (97.45), సీతారామ్‌చరణ్ (97.27), వంశీక్రిష్ణారెడ్డి (97.23), అమ్రిత (97.05), అజయ్‌క్రిష్ణారెడ్డి (96.79), శివ సాయితేజ (96.52), అనిరుధ్ (96.45), అరవింద్ (96.44), మోహిత్ కుమార్‌రెడ్డి (96.10), ప్రణతి (95.37), మహర్షి (95.30), వినీల (95.26), షణ్ముఖ శివాన్విత (95.25) పర్సంటైల్ సాధించారు. దీంతో ఆ విద్యార్థులను కళాశాల కోర్ డీన్ బద్రీనాథ్, డీజీఎం వెంకటరామిరెడ్డి, డీన్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ రవిశంకర్‌రెడ్డి, శిఖామని, హిమబిందు, లక్ష్మన్న, ఒబన్న గౌడ్, జయలక్ష్మీ, శ్రీధర్‌బాబు, ఈశ్వరి, ఏజీఎంలు హరిప్రసాద్, కేశవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి అభినందించారు.

సతీష్ రెడ్డి సత్తా

జేఈఈ మెయిన్‌లో బుక్కరాయసముద్రం మండలం చిన్నంపల్లికి చెందిన రైతు లక్ష్మిరెడ్డి కుమారుడు సతీష్ రెడ్డి సత్తా చాటాడు. 99.99 పర్సంటైల్ సాధించాడు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు ఆనందం వ్యక్తం చేశారు.



99.99 పర్సంటైల్ సాధించిన సతీష్‌రెడ్డి



99.89 పర్సంటైల్ సాధించిన శశికిరణ్



99.64 పర్సంటైల్ సాధించిన మేఘన




99.23 పర్సంటైల్ సాధించిన పఠాన్



99.08 పర్సంటైల్ సాధించిన నవదీప్

సేవాలాల్ జయంత్యుత్సవాలు ప్రారంభం

గుత్తిరూరల్, ఫిబ్రవరి 13: మండలంలోని బంజరాల పవిత్ర పుణ్యక్షేత్రం సేవాఘడ్‌లో మంగళవారం సంత్ సేవాలాల్ మహరాజ్ 285 జయంత్యుత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి వేకువజామున పంచామృతాభిషేకం చేసి, వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో హోమాలు, కలశ స్థాపన, నవగ్రహ పూజ చేశారు. స్వామివారి ఉత్సవ మూర్తులను సాయంత్రం పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాలతో ఊరేగించారు. స్వామివారికి బుధవారం ఉదయం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు జరిపిస్తామని నిర్వాహకులు తెలిపారు. రాత్రికి వివిధ రాష్ట్రాల నుంచి బంజారాలు పెద్దతున తరలివస్తారన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ ఉత్సవ మూర్తిని పల్లకిలో కొలువు దీర్చి గుర్రంపై ఊరేగించనున్నట్లు వెల్లడించారు. మాలధరించి వచ్చిన భక్తులు ఇరుముడి సమర్పిస్తారని తెలిపారు. గురువారం మాతా జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి 101 మంది యువతులతో బోనాలు సమర్పిస్తారు. అనంతరం అత్యంత కీలకమైన మహాబోగ్ కార్యక్రమాన్ని నిర్వహించడంతో జయంతి ఉత్సవాలు ముగుస్తాయని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు జగనాథరావు, ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థనాయక్, ఎస్ కే రామచంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో సేవాలాల్ మహారాజ్

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 13: బాలికల ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల, శ్రీసత్యసాయి జిల్లాలోని విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి అనంత జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు ప్రకటనలో సూచించారు. రెండు జిల్లాలోని కళాశాలల్లో కలిపి ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు ఖాళీలున్నాయన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి ఈ నెల 25వ తేదీ వరకూ అవకాశం ఉందని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఉంటుందని అన్నారు. గిరిజన బాలికలు ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. పూర్తి వివరాల కోసం https://www.aptwgurukulam.gov.in వెబ్‌సైట్ లేదా సెల్ 83090 05097కు సంప్రదించాలన్నారు.

జేఈఈ ఫలితాల్లో నారాయణ కళాశాల విద్యార్థి ప్రతిభ

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 13: జెఈఈ ఫలితాల్లో హిందూపురం నారాయణ కళాశాలకు చెందిన ఆసిమ్‌ఖాన్ 99.23 మార్కులు సాధించినట్లు ఏజీఎం కేశవరెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆసింఖాన్ మాట్లాడుతూ ఐఏఎస్, ఐపీఎస్ లక్ష్యంగా చదివానన్నా రు. అధ్యాపకుల సహకారంతోనే ఈ స్థాయిలో నిలిచానన్నారు. విద్యార్థిని కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.



ఆసిమ్‌ఖాన్‌ను అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

మెరిసిన పురం విద్యార్థులు

హిందూపురం, ఫిబ్రవరి 13: జేఈఈ ఫలితాల్లో హిందూపురానికి చెందిన విద్యార్థులు చక్కటి ప్రతిభను కనబరిచారు. హిందూపురానికి చెందిన సువర్ణభారతి విద్యాసంస్థల అధినేత నీలకంఠారెడ్డి కుమారుడు గగన్‌శ్యామ్‌రెడ్డి 99.58 మార్కులు సాధించాడు. అదే కళాశాలకు చెందిన ఇంద్ర వంశీ 94.86, సారిక 88.58 ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంగళవారం కళాశాలలో యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు. విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ఏఓ అనీల్‌కుమార్ తెలిపారు. గగన్‌శ్యామ్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో దేశానికి, సమాజానికి ఉపయోగపడేలా ఉద్యోగం సాధించాలన్నదే తన లక్ష్యమన్నారు.



జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

మెరిసిన తాడిపత్రి విద్యార్థి

తాడిపత్రి టౌన్, ఫిబ్రవరి13: జనవరిలో జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో తాడిపత్రికి చెందిన విద్యార్థి చక్రధర్‌రెడ్డి 256మార్కులతో 99.91 పర్సంటైల్ సాధించాడు. పట్టణానికి చెందిన సంగటి శ్రీనివాసులరెడ్డి, సంగటి రాజేశ్వరి దంపతుల కుమారుడు చక్రధర్‌రెడ్డి విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చక్రధర్‌రెడ్డి 8, 9, 10 తరగతులు పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో చదివాడు. తండ్రి వృత్తిరీత్యా ఎల్ఐసీ ఏజెంట్. తల్లి గృహిణి. జేఈఈ మెయిన్స్‌లో మంచి ప్రతిభ చూపిన చక్రధర్ రెడ్డిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



చక్రధర్‌రెడ్డి

నేటి నుంచి వైసీపీపై యుద్ధానికి సిద్ధం

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మిక సంఘాల నేతలు హెచ్చరిక

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 13: 'మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నా నిర్లక్ష్యం వహిస్తారా...? మీ ఐదేళ్ల మోసానికి గుణపాఠం చెబుతాం.. ఇక బుధవారం నుంచి వైసీపీ ప్రభుత్వంపై మేం యుద్ధానికి సిద్ధం' అని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మిక సంఘాల నేతలు రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్జీఓ హోంలో ఏపీ జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో ఏపీఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... సోమవారం రాత్రి అన్ని సంఘాల నేతలతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు తొమ్మిది గంటలు చర్చలు జరిపారని, అయినా ఏ ఒక్కటిపై సరైన సమాధానం ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యమ కార్యాచరణకు సంబంధించిన నోటీసులు అందజేశామని, బుధవారం నుంచి ఉద్యమాలకు శ్రీకారం చుడుతున్నామని అన్నారు.



ఐక్యతను చాటుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మిక సంఘాల నేతలు



ఆర్ట్స్ కళాశాలలో చిన్నారుల నృత్యం, బహుమతులను అందిస్తున్న అధికారులు







తపోవనం ఏబీసీ పాఠశాల బాలోత్సవం... బహుమతి అందుకొంటున్న కిరణ్‌కుమార్

అలరించిన బాలోత్సవం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 13: స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బాలోత్సవాలు రెండో రోజైన మంగళవారం కొనసాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నారులు వివిధ ప్రదర్శనలు ఇచ్చారు. అకడమిక్, సాంస్కృతిక పోటీల్లో వంద మందికి పైగా పాల్గొన్నారు. సాంస్కృతిక పోటీల్లో చిన్నారుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. నాటక ప్రదర్శనలు ఆలోచింపజేసేలా సాగాయి. ఈ పోటీలను తిలకించేందుకు నగరవాసులు వందలాదిగా ఆర్ట్స్ కళాశాల మైదానానికి తరలివచ్చారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బాలోత్సవాల నిర్వహణ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫివుల్లా, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, ఏడీ క్రిష్టయ్య, ఆర్డీటి ఛైర్మన్ తిప్పేస్వామి బహుమతులు అందజేశారు.

చిత్రలేఖనంలో సోదనపల్లి విద్యార్థి ఫస్ట్

శింగనమల : అనంతపురంలో ఆర్ట్స్ కాలేజ్‌లో మంగళవారం నిర్వ హించిన జిల్లాస్థాయి బాలోత్సవం చిత్రలేఖనం పోటీల్లో శింగనమల మండలం సొదనపల్లి జిల్లా పరిషత్ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి కిరణ్‌కుమార్ ప్రథమ బహుమతి సాధించారు. అతన్ని ఆ పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

వైసీపీ నుంచి వలసలు ఆపుకో

ఎన్నికల్లోగా రాప్తాడులో ఆ పార్టీ ఖాళీ : మాజీ మంత్రి పరిటాల సునీత



పరిటాల సునీత సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 13: 'రాప్తాడు నియోజకవర్గంలో అధికార వైసీపీ పార్టీలో చాలా మంది నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, ఆయన సోదరులపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. దీంతో వారు తిరుగుబాటు చేసి.. స్వచ్ఛందంగా ఆ పార్టీ వీడి టీడీపీలో చేరుతున్నారు. దీంతో ప్రకాశ్‌రెడ్డికి అప్పుడే ఓటమి భయం పట్టుకుంది. మా కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. మాపై ఆరోపణలు మాని.. ముందు నీ పార్టీ నుంచి వలసలను ఆపుకో...' అని ప్రకాశ్‌రెడ్డికి మాజీ మంత్రి పరిటాల సునీత సూచించారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పరిటాల సునీత, టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి సమక్షంలో సీకేపీ మండలంలోని వెల్దుర్తి, నాగసముద్రం గ్రామాలకు చెందిన 30 కుటుంబాలు వైసీపీ వీడి టీడీపీలో చేరాయి. ఆమె మాట్లాడుతూ... రాప్తాడులో వైసీపీ ఖాళీ కావడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే తీరుపై నియోజకవర్గ ప్రజలు విసుగుచెందారని, వైసీపీలో సామాన్యులే కాకుండా ముఖ్యనాయకులు సైతం ఇబ్బందులు పడుతున్నారని, నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే వైసీపీ నుంచి టీడీపీలోకి పెద్దఎత్తున వలసలు కొనసాగుతున్నాయని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, జనసేన గాలివీస్తోందని, రాప్తాడులో తమ గెలుపును ఎవరు ఆపలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబిలేసు, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, తెలుగుమహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ, నాయకులు ఈడిగ బార్గవగౌడ్, పణీంద్ర పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

మాతా,శిశు మరణాల సమీక్షలో డీఎంహెచ్ఓ

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 13: హైరిస్క్ గర్భిణీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆస్పత్రికి కాన్పుకొచ్చిన ఏతల్లీ.. బిడ్డ చనిపోకూడదని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. ఇదే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలన్నారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో గత నెలలో జరిగిన మాతా శిశుమరణాలపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఐదు శిశుమరణాలకు కారణాలు గురించి ఆయా ఆస్పత్రుల డాక్టర్లు, సిబ్బందితో ఆరా తీశారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ఒకసారి తప్పు జరిగితే అందుకు కారణాలను విశ్లేషించుకొని.. భవిష్యత్తులో మళ్లీ పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ (డీఐఓ) డాక్టర్ యుగంధర్, ఎంపీహెచ్ఈఓ లక్ష్మన్న, ఎంపీహెచ్ఎస్ హేమలత పలువురు వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

అర్చక సమస్యలపై పోరు సాగిద్దాం

ఏపీ అర్చక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 13: అర్చక పురోహితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమష్టి పోరాటం సాగిద్దామని ఏపీ అర్చక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు సూచించారు. అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని వంశపారంపర్య అర్చకులను 43-10 రిజిస్టరులో నమోదు చేయాలన్నారు. డీడీఎన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వెంటనే పూర్తి చేసి అర్చకులకు సహకరించాలని కోరారు. ధూప దీప నైవేద్య అర్చకులకు ఇచ్చే వేతనాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని కోరారు. రూ.ఐదు లక్షలలోపు ఆదాయమున్న ఆలయాల నిర్వహణను అర్చకులకే అప్పగించాలన్నారు. రైతు భరోసా పొందేందుకు అర్చకులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి అర్చకులకు న్యాయం చేయాలన్నారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో 200కు పైగా అర్చకుల డీడీఎన్ అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం అర్చకులంతా ఏకతాటిపై నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య నాయకులు బసవరాజు, అర్చకం పుల్లమాచార్యులు, భీమప్ప, శివశంకరశర్మ, తిమ్మరాజు, గోపాలు పాల్గొన్నారు

స్వయం ఉపాధి కోర్సులకు ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 13: సీడాప్, కేంద్ర ప్రభుత్వ దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకం ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి, ఉద్యోగాల కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి తెలిపారు. డీఆర్‌డీఏ-సీడాప్ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌ఐటీ కళాశాలలో నిర్వహించే ఉచిత కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, సూపర్‌వైజర్ కోర్సుల ఉచిత శిక్షణకు ఈనెల 18 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నాలుగు నెలల పాటు సాగే ఈ శిక్షణలో ఉచిత యూనిఫాం, స్టడీ మెటీరియల్, భోజన, వసతి సదుపాయాలు అందజేస్తామన్నారు. శిక్షణ అనంతరం నూరుశాతం ఉపాధి కల్పిస్తామన్నారు. 18-26 మధ్య వయస్సు కలిగి, పదోతరగతి, ఇంటర్ చదవి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 86394 39804, 80744 52233, 77309 30919ను సంప్రదించాలన్నారు.

రేపు రేడియో రైతు దినోత్సవం

అనంతపురం కల్చరల్/ అర్బన్, ఫిబ్రవరి 13: కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో గురువారం ఉదయం 10 గంటలకు రేడియో రైతు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆకాశవాణి కేంద్రం ప్రోగ్రాం హెడ్ నాగేశ్వర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి కలెక్టర్ గౌతమి, ప్రజాప్రతినిధులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని, జిల్లా అధికారులు, రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చీనీకాయలు టన్ను రూ.18వేలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 13: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.15 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 10 టన్నులు వచ్చాయన్నారు.

రోడ్డు నియమాలపై అవగాహన

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 13: రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో వాహనదారులకు రోడ్డు భద్రత, నియమాలపై అవగాహన కార్యక్రమాన్ని అనంతపురం ఆర్టీఓ సురేష్‌నాయుడు మంగళవారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలకు ఎవరైనా గురైతే క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించి మానవత్వాన్ని చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ శ్రీనివాసులు, వాహనదారులు పాల్గొన్నారు.

శంఖారావం సభకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

గార్లదిన్నె, ఫిబ్రవరి 13: బుక్కరాయసముద్రంలో మంగళవారం నిర్వహించిన శంఖారావం మద్దతు బహిరంగసభకు మండలం నుంచి పెద్దఎత్తున తెలుగు తమ్ముళ్లు బయలుదేరారు. మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ విశాలాక్షి, టీడీపీ నాయకులు గేట్ కృష్ణారెడ్డి, గుర్రం ఆదినారాయణ, ఆవుల కృష్ణ, గుత్తా బాలకృష్ణ, ఇల్లూరు రామాంజి, వన్నూర్, సుంక, గుర్రం శీన, వెంకట్రామిరెడ్డి, పుల్లన్న, బాబయ్య, జగదీష్, అంజి, రామచంద్ర, జయరాం, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు తరలివెళ్లారు.

క్రైస్తవులను మోసం చేసేందుకు మళ్లీ జగన్నాటకాలు



మాట్లాడుతున్న స్వామిదాస్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 13: రాష్ట్రంలోని క్రైస్తవులను మోసం చేసేందుకు సీఎం జగన్ మళ్లీ నాటకాలు మొదలు పెట్టారని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ మండిపడ్డారు. మంగళవారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో విమలారెడ్డి అనే క్రైస్తవ మహిళ రాష్ట్ర వ్యాప్తంగా తిరుగుతూ మోసపూరిత హామీలు ఇస్తున్నారన్నారు. క్రైస్తవుల ఆస్తులు దోచుకుంటుంటే.. వారంతా అప్పుడు ఎక్కడున్నారో సమా ధానం చెప్పాలన్నారు. టీడీపీ హయాంలో 277 చర్చిలు కట్టించారని, వైసీపీ పాలనలో ఒక్క చర్చి అయినా కట్టించారా అని నిలదీశారు. ఐదేళ్లల్లో క్రైస్తవులకు ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయ కుండా మోసం చేశారని మండిపడ్డారు. సీఎం జగన్ కపట ప్రేమను నమ్మకుండా క్రైస్తవులంతా ఏకమై రాబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు.

ఎన్నికల్లో నిత్యం అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 13: ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారుల పాత్ర చాలా కీలకమని, వారు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు నిత్యం అప్రమత్తంగా ఉండాలని కలెక్టరు గౌతమి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఎన్నికల నోడల్ అధికారులు, ఏఎల్‌టీఎంటీలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పీఓ బుక్ ప్రతిఒక్కరూ చదివి అందులో ఉన్న ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని, అప్పుడే ఎలాంటి సమస్య వచ్చినా సులభంగా పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని గుర్తించా లన్నారు. బస్సులు, మినీవాహనాలు ఎన్ని అవసరమవుతాయో సరిచూసుకొని సంబంధిత ఈఆర్‌ఓలతో మాట్లాడి పూర్తి వివరాలు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే ఎవరికి ఎప్పుడు శిక్షణ ఇవ్వాలో కూడా కమిషన్ తేదీలు ప్రకటిస్తుందని, ఆ ప్రకారం ముందుగానే ట్రైనింగ్ షెడ్యూల్ ఏర్పాటు చేసుకొని శిక్షణలు పూర్తి చేయాలన్నారు. జిల్లా స్థాయిలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్నిరకాల వివరాలను సేకరించి సంబంధిత అధికారులకు చేరవేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించి హెల్ప్‌లైన్, కాల్‌సెంటర్స్ ఏర్పాటు చేసుకొని వచ్చిన ఫిర్యాదులను ఎన్నికల కమిషన్‌కు పంపించాలన్నారు. ఎవరికి అప్పగించిన విధులు అత్యంత కీలకంగా భావించి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీసీఈఓ వైఖేల్ నిదియా, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డిప్యూటీ కలెక్టర్లు నీలమయ్య, డీఆర్‌డీఏపీడీ నరసింహారెడ్డి, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు.

మాఘమాస ప్రత్యేక పూజలు



ఆత్మకూరు ఫిబ్రవరి 13 : మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో మంగళవారం మాఘమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పలు అభిషేకాలు నిర్వహించి.. ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి సాకేతపురం శోభ, సిబ్బంది పాల్గొన్నారు.

18 క్వింటాళ్ల బియ్యం సీజ్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 13: లారీలో అక్రమంగా తరలిస్తున్న 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుక్కరాయసముద్రం మండలం విజయనగర కొట్టాల చెన్నంపల్లి రోడ్డు వద్ద సీఐ సాయిప్రసాద్, ఏఈఈ రాజశేఖర్ మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వాహన యజమాని, డ్రైవర్, బియ్యం యజమానిని అదుపులోకి తీసుకొని.. కేసు నమోదు చేశారు. బియ్యాన్ని స్థానిక సీఎస్‌డీటీ నరేష్‌కుమార్‌కు అప్పగించారు.

మత్స్యసహకార సంఘం త్రిసభ్య కమిటీ ఎంపిక

అనంతపురం ప్రెస్‌క్లబ్ : స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో ఎఫ్‌డీఓ పక్కీరయ్య అధ్యక్షతన డీడీ శ్రీనివాస్ ముగ్గురితో కూడిన త్రిసభ్య కమిటీని మంగళవారం ఎంపిక చేశారు. వైటీ చెరువు సొసైటీ అధ్యక్షుడు బెస్త కోట నసప్ప, మర్తాడు సొసైటీ అధ్యక్షుడు బెస్త సుబ్బన్న, బోయ పందికోన సహదేవలతో ప్రమాణస్వీకారం చేయించారు.

ఆనందరావుపేట నీటి సమస్యను పరిష్కరించండి

శింగనమల, ఫిబ్రవరి 13: మండలంలోని ఆనందరావుపేట గ్రామంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీపీఎం నాయకులతో కలిసి ఎంపీడీఓ రమణకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో 10 రోజుల నుంచి తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదని, వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు.

నేడు పోలేపల్లెకు నారా భువనేశ్వరి

రామగిరి, ఫిబ్రవరి 13: చంద్రబాబు అక్రమ అరెస్టుతో కలతచెంది మరణించిన వెంకటరాముడు కుటుంబసభ్యులను పరామర్శించడానికి మండలంలోని పోలేపల్లి గ్రామానికి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి వస్తున్నారని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటి మద్దిరంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్ తెలిపారు. నిజం గెలవాలి పేరుతో చేపట్టిన ఈ యాత్రలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జనసేన ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్‌గా అంగడి చలపతి



అంగడి చలపతిని సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 13: జనసేన పార్టీ ఉమ్మడి అనంత జిల్లా ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్‌గా అంగడి చలపతిని ఆ పార్టీ నియమించింది. ఈ మేరకు మంగళవారం అనంతపురంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జనసేన పార్టీ కార్యక్రమాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్ ఆధ్వర్యంలో చలపతిని సన్మానించారు. భవానీ రవికుమార్ మాట్లాడుతూ... చలపతి మెగా అభిమానిగా అనేక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. ప్రస్తుతం పార్టీలో ఆయనకు కీలక బాధ్యతలను అప్పగించడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి, కాయగూరల లక్ష్మీప్రసాద్, జగదీష్, జేకే రమేష్, ఇమామ్ హుస్సేన్, భాస్కర్, శేషాద్రి, సురేష్, శామీర్, చిన్నా, ఆకుల ప్రసాద్ పాల్గొన్నారు.

చెస్ విజేతలకు అభినందనలు



జిల్లా స్థాయి చెస్ విజేతలను అభినందిస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 13: స్థానిక వెరీడియన్ ఎకోల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పాఠశాలల క్రీడాకారుల పోటీలో భాగంగా సోమవారం రాత్రి ఫైనల్స్ నిర్వహించారు. ఇందులో శామ్యూల్, అనన్య, అభిగ్న విజేతలుగా నిలిచారు. ఆ విద్యార్థులను ఆ స్కూల్ యాజమాన్యం రామయ్య, చీఫ్ కోచ్ మజీద్‌ఖాన్, జిల్లా గౌరవాధ్యక్షుడు బాలరాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ టోర్నీ డైరెక్టర్ హుస్సేన్‌ఖాన్, చీఫ్ ఆర్బిటార్ సాయిచరణ్ పాల్గొన్నారు.

యూజీ అడ్మిషన్లపై అవగాహన

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 13: ప్రముఖ సెంట్రల్ యూనివర్సిటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ అడ్మిషన్లపై కురుగుంటలోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం అవగాహన కల్పించారు. ఇండియా ఫర్ ఇండియా ఫౌండేషన్ ముఖ్యుడు డాక్టర్ అప్పికట్ల భరత్‌భూషణ్ కామన్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష, కామన్‌లా అడ్మిషన్ టెస్ట్, ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ తదితర వాటికి సంబంధించి కోర్సు, అర్హత, ఎంట్రెన్స్‌తో యూపీఎస్సీ పరీక్ష విధాలను గురించి విద్యార్థులకు వివరించారు. సెంట్రల్ యూనివర్సిటీలో అడ్మిషన్లు పొందాలనుకునే విద్యార్థులకు ఫౌండేషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అనంతరం పలు మెటీరియల్స్ విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎస్‌బీఐ అధికారి హేన నళిని, మినిస్ట్రీస్ ఆఫ్ డిఫెన్స్ విశ్రాంత డైరెక్టర్ బజాన్ సతీష్‌కుమార్, మారెప్ప శంకర్, ఫౌండేషన్ సమన్వయకర్త శివకుమార్, కళాశాల ప్రిన్సిపల్ సునీత, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు కీర్తన, కార్తీక్ పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

శింగనమల, ఫిబ్రవరి 13: శింగనమలలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. అతని నుంచి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్ట్ చేశామన్నారు.

ప్రాక్టికల్స్‌కు 222 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 13: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు మంగళవారం 222 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఎగ్జామ్స్ కమిటీ కన్వీనర్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జనరల్ విద్యార్థులు 48 మంది, ఒకేషనల్ విద్యార్థులు 108 మంది, మధ్యాహ్నం జనరల్ విద్యార్థులు 41 మంది, ఒకేషనల్ విద్యార్థులు 25 మంది పరీక్షలకు రాలేదన్నారు.

మతిస్థిమితం లేని యువకుడి ఆత్మహత్య

రాప్తాడు, ఫిబ్రవరి 13: మతిస్థిమితం లేని జార్ఖండ్ వాసి అబుజైద్ (21) రాప్తాడులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. అబుజైద్ అన్సరీ, అతని భార్య తమయనదిని ఇద్దరు పిల్లలతో బతుకు తెరువు కోసం రెండేళ్ల క్రితం అనంతపురానికి వచ్చారు. ఆరు నెలల కిందట రాప్తాడు గ్రామానికి వచ్చి మసీదు దగ్గర ఇంట్లో అద్దెకు ఉన్నారు. రాప్తాడు పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న చికెన్ సెంటర్‌లో వంట మాస్టారుగా అబుజైద్ పని చేసేవాడు. మతి స్థిమితం సరిగ్గా లేక ఇది వరకే ఒకటి రెండు సార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. మంగళవారం తెల్లవారుజామున ఇంటి పక్కనే ఉన్న వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు గమనించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రౌడీషీటర్ జిలాన్ హత్యకేసులో ఐదుగురి అరెస్ట్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 13: స్థానిక వెంకటేశ్వర ఐటీఐ కళాశాల సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రౌడీషీటర్ సయ్యద్ జిలాన్ (33) హత్య కేసును 24 గంటల్లోనే చేధించినట్లు ఒకటో పట్టణ సీఐ రెడ్డప్ప, ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఐదుగురిని అరెస్ట్ చేసి.. మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం వారు చెప్పారు. వారు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకృష్ణదేవయరాయనగర్ 2021లో జరిగిన హత్యకేసులో నిందితుడైన సయ్యద్ జిలాన్ అలియాస్ కుక్కల జిలాన్‌పై పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు. రాణినగర్‌కు చెందిన ప్రసాద్, నరేష్‌తో కలిసి జిలాన్ బేల్దారి పనులు చేసేవాడు. పనుల కూలి విషయంలో గొడవలు తెలెత్తడంతో జిలాన్‌ను ప్రసాద్, నరేష్ చంపాలని పథకం పన్నారు. నరేష్ బావ బుక్కరాయసముద్రం మండలం ఎల్బీ నగర్‌కు చెందిన యల్లప్ప, రాణినగర్‌కు చెందిన తమ్ముడు ప్రతాప్, చెల్లెలు సవర్ణ సహకారంతో జిలాన్‌ను బండరాయితో కొట్టి హత్యచేశారు. ఈ క్రమంలో అడ్డుకోబోయిన జిలాన్ స్నేహితుడు చంద్రశేఖర్‌ను కట్టెలతో దాడి చేయడంతో ఆయన గాయపడ్డాడు. నిందితులను ఎన్‌టీఆర్ మార్గ్ రోడ్డులో అరెస్ట్ చేశారు.

దొంగతనం కేసులో జైలు శిక్ష

స్థానిక రెండో రోడ్డులోని గత సంవత్సరం అక్టోబరులో ఒక ఇంటిలో దొంగతనం జరిగింది. కేసు దర్యాప్తు చేపట్టిన మూడో పట్టణ సీఐ ధరణికిషోర్ గుజరాత్‌కు చెందిన విక్కీ అనే నిందితుడిని అరెస్ట్ చేసి.. చార్జిషీటు దాఖలు చేశారు. జేఎఫ్ఎం స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ జె.సుజిన్ కుమార్ విక్కీకి ఏడు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

రిమాండ్‌కు 19 మంది రైతులు

శింగనమల, ఫిబ్రవరి 13: శింగనమల మండలంలో ఉల్లికల్లు ముంపు పరిహారం విషయమై రోడ్డు దిగ్బంధం కేసులో 19 మంది రైతులను సెకండ్ స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు రిమాండ్ పంపింది. ఉల్లికల్లు గ్రామం చాగల్ రిజర్వాయర్ కింద ముంపు నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో 2017లో రైతు సంఘం నాయకులు, రైతులు మండలంలోని నాయనపల్లి క్రాస్‌లో రోడ్డు దిగ్బంధం చేపట్టారు. అప్పుడు 26 మందిపై కేసు నమోదు చేయగా.. ఏ-1గా ఆలూరు సాంబశివారెడ్డి ఉన్నారు. 26 మందిలో ఇద్దరు మృతి చెందాగా మిగిలిన 24 మంది వాయిదాలకు హాజరు కాలేదు. వారికి ఈనెల 8న వారెంట్ జారీకాగా, మంగళవారం 19 మంది రీకాల్ కోసం వెళ్లారు. కోర్టు వారిని రిమాండ్‌కు పంపింది. ఆలూరు సాంబశివారెడ్డి, వైసీపీ నాయకుడు బొమ్మన శ్రీరామిరెడ్డి, మరో ముగ్గురు రీకాల్‌కు రాలేదు.

కాపర్ వైరు చోరీ

ఆత్మకూరు ఫిబ్రవరి 13: మండలంలోని మదిగుబ్బ గ్రామంలోని వ్యవసాయ తోటలోని ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైరును సోమవారం రాత్రి దుండగులు చోరీ చేసినట్లు బాధిత రైతు కురుబ పుల్లన్న వాపోయాడు. దీనిపై పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పంటకు నీటితడులు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని, ట్రాన్స్‌కో అధికారులు న్యాయం చేయాలని కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

శింగనమల, ఫిబ్రవరి 13: తరిమెల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి శింగనమల పోలీస్ స్టేషన్ తరలించామని మంగళవారం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ చితంబరయ్య, అంజన్‌రెడ్డి, సాయి పాల్గొన్నారు.

మార్కెటింగ్ లక్ష్యాలపై సమీక్ష

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 13: అనంతపురం జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయంలో 2024-25ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి జిల్లా లక్ష్యాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. మార్కెట్ జేడీ రామాంజినేయులు డీడీ శ్రీకాంత్‌రెడ్డి, అనంతపురం, సత్యసాయి జిల్లాల ఏడీలు సత్యనారాయణ చౌదరి, మూర్తిలతో కలసి ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ కమిటీ ఆదాయం, వ్యయాలు తదితర వాటని సంబంధిత కార్యదర్శులతో విడివిడిగా చర్చిం చారు. లక్ష్యాలను నిర్దేశించుకుని వాటికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. అనంతపురం జిల్లాకు రూ.11.75 కోట్లు, సత్యసాయి జిల్లాకు రూ.5.09 కోట్ల లక్ష్యాన్ని ప్రతిపాదించారు. ఆ లక్ష్యాలను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు పంపుతామని జేడీ తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ కమిటీల కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆడిట్

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో ఆడిట్ అధికారులు దస్తగిరి, శ్రీనివాసులు గౌడ్ మంగళవారం ఆడిట్ చేపట్టారు. కమిటీ ఖర్చులు, ఆదాయం, యార్డులో షాపుల బాడుగలు తదితర రికార్డులను పరిశీలించారు.

ఏళ్లు గడుస్తున్నా..!

కంకర తేలిన ఎస్ఆర్ కాలనీ - సిండికేట్ నగర్ రహదారి

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 13: మండలంలోని అక్కంపల్లి పంచాయతీ ఎస్ఆర్ కాలనీ నుంచి రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. మట్టిరోడ్డు కావడంతో గుంతలు ఏర్పడ్డాయి. రెండేళ్ల కిందట రోడ్డు నిర్మాణం కోసమని పెద్ద కంకర తోలారు. అయితే రోడ్డు నిర్మాణం మాత్రం జరగలేదు. దీంతో రోడ్డు అంతా సైజ్ తేలిఉంది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటనే ప్రయాణికులు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి... రోడ్డును బాగు చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.





ఎస్ఆర్ కాలనీ నుంచి సిండికేట్ నగర్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి



ఆదాయానికి గండి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 13: నగరంలోని ప్రధాన రహదారుల్లో లాలీపాప్స్ ఏర్పాటు చేసి.. వాటిల్లో ప్రకటన ద్వారా నగర పాలక సంస్థకు ఆదాయం వచ్చేది. అయితే ఇటీవల విద్యుత్‌నగర్ సర్కిల్ నుంచి నవోదయ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలోని లాలీపాప్స్‌ల్లో సిద్ధం పోస్టర్లు వెలిశాయి. వీటికి డబ్బులు చెల్లించడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో సంస్థ ఆదాయానికి గండిపడుతోంది. ఈ విషయంపై టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది.



ముగేత్తమపల్లిలో దాహం దాహం

నార్పల, ఫిబ్రవరి 13: మండలంలోని ముగేత్తమపల్లి గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని పంచాయతీ బోర్లు రెండు ఉండగా ఒక బోరులో నీరు పూర్తిగా అడుగంటి పోయాయి. మరోదానిలో ఉన్న కొద్ది నీటినే ఆ గ్రామస్థులు తాగుతున్నారు. మూడు రోజుల క్రితం ఆ బోరుకు ఉన్న మోటార్ చెడిపోయింది. టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ ఆకుల అంజనేయులు సొంత డబ్బులతో ఏర్పాటు చేసి చిన్న ట్యాంక్ నీరే ఆ గ్రామస్థులకు దిక్కైంది. మరి కొందరు సమీపంలోని వ్యయసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. మోటార్ కాలిపోయినా అధికారులు, పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అంజనేయులు ఏర్పాటు చేసిన ట్యాంక్ వద్ద క్యూలో ఉంచిన బిందెలు

జగన్‌కు ఓటు వేస్తే రాష్ట్రం తాకట్టే: టీడీపీ


ప్రచారం నిర్వహిస్తున్న జితేంద్ర గౌడు

గుంతకల్లు, ఫిబ్రవరి 13: ఎన్నికల ముందు జగన్ చెబుతున్న కల్లబొల్లి మాటలు నమ్మరాదని, మరలా ఓటువేస్తే రాష్ట్రాన్నే తాకట్టు పెట్టేస్తాడని మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడు పేర్కొన్నారు. పట్టణంలోని 27వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంచి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. చంద్రబాబు ఏదైనా చెబితే చిత్తశుద్ధితే నెరవేరుస్తారన్నారు. కనుక రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్ కుమార్ గౌడు, అనిల్ కుమార్ గౌడు, తలారి మస్తానప్ప, హనుమంతు, ఇలియాజ్, గిడ్డయ్య, ఆటో ఖాజా, ఫజులు, జగన్నాథ్, బండి లక్ష్మీదేవి, సలీం, అక్తర్, మస్తాన్, నిజాం, ఇస్మాయిల్, ఆరిఫ్, పులికొండ, బద్రి పాల్గొన్నారు.

సైకో జగన్‌కి రోజులు దగ్గర పడ్డాయి


అబ్బేదొడ్డిలో పథకాలు వివరిస్తున్న వెంకటశివుడు యాదవ్

గుత్తిరూరల్, ఫిబ్రవరి13: సైకో జగన్‌కి రోజులు దగ్గర పడ్డాయి అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో మంగళవారం టీడీపీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భవిష్యత్తుకు గారెంటీ పథకాల గురించి మహిళలకు వివరించారు. కార్యక్రమంలో బండారు ఆనంద్, మోహన్ దాస్, బాలరంగారెడ్డి, సుధాకర్ నాయుడు, గురునాథ్, ధనుంజయ్యరెడ్డి, ఆది నారాయణ, నారాయణరెడ్డి, ఓబులయ్య, లాలుస్వామి, దేవేంద్ర, గోపాల్ పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 13: జగన్‌ను ఇంటికి సాగనంపడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లింగరాజుయాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. వైసీపీ మంత్రులు 90శాతం హామీలు నెరవేర్చామని చెప్తుంటే రాష్ట్ర ప్రజలు నవ్వుతున్నారన్నారు. జగన్ ఉత్తిత్తి బటన్ నొక్కడం తప్పా లబ్ధిదారుల అకౌంట్‌లో డబ్బులు పడటం లేదన్నారు. రాష్ట్ర ప్రజలు మిమ్మల్ని సాగనంపడానికి బటన్ నొక్కే సమయం వచ్చిందన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 13: కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం ప్యాకెట్లు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 188(90 ఎంఎల్) కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్న ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కళ్లహోళ గ్రామానికి చెందిన బోయ కెంచన్న, గోవిందవాడ గ్రామానికి చెందిన రామాంజినేయులు అనే వ్యక్తులు ఏపీ 02 ఏజే 9098 నంబర్ గల ద్విచక్ర వాహనంలో అక్రమంగా కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా కళ్ళహోళ గ్రామ సమీపంలో వారిని అరెస్టు చేసి 188(90 ఎంఎల్) మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువును పరిశీలించిన రైల్వే అధికారులు

యాడికి, ఫిబ్రవరి 13: మండలంలోని రాయలచెరువు గ్రామ చెరువును దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ప్రభాకర్‌రావు మంగళ వారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెరువునుంచి ఓవర్‌ఫ్లో జరి గితే రైల్వే లైనుకు ఏదైనా ప్రమాదం సంభవించే సంఘటనలు ఉన్నాయా లేదా అని పరిశీలించామని తెలిపారు. రాయలచెరువు చెరువుకు, రైల్వేలైన్‌కు చాలా దూరం ఉందని తెలిపారు. నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు. ఆయన వెంట జేఈ నూర్జహాన్ ఉన్నారు.

తురకపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ


తురకపల్లిలో కరత్రాలను అందజేస్తున్న హిమబిందు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 13: మండలంలోని తురకపల్లిలో మంగళవారం టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు పత్తి హిమబిందు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాల గురించి మహిళలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణ, రాము, వీరాంజునేయులు, నరేష్, ప్రతాప్, రామయ్య, ప్రవీణ్, కదిరెప్ప, చాగంటి గోవిందురాజులు, మనోహర్, జానికి, మాధవి, అరుణ, రాధ, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

యల్లనూరు, ఫిబ్రవరి13: మండలంలోని శింగవరం గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని మంగళవారం అరెస్ట్ చేసి వారి నుంచి రూ.40850 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. గొడ్డుమర్రి గ్రామ సమీపంలోని శివరామిరెడ్డి తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. వీరిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

తీటకల్లులో ఐదుగురు..

బ్రహ్మసముద్రం: మండలంలోని తీటకట్లు గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పరశురాముడు తెలిపారు. వారి నుంచి రూ. 5930 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

బెళుగుప్ప, ఫిబ్రవరి 13: మండలంలోని వెంకటాద్రిపల్లి, శీర్పి, కోనాపురం పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో సుబ్బరాజు, ఈవోఆర్డీ మాధవరెడ్డి మంగళ వారం తనిఖీ చేశారు. ఓటర్లకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వసతులు కల్పించేందుకే చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు.

ఇది మోసం డీఎస్సీ: విద్యార్థి సంఘాలు


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి నాయకులు

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 13: ఇది మెగా డీఎస్సీ కాదు మోసపు డీఎస్సీ అని టీఎన్ఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, జనసేన నాయకులు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి టీ సర్కిల్ వరకు చెవిలో పూలు పెట్టుకుని తాళాలు వాయిస్తూ ర్యాలీగా వెళ్లారు. అనంతరం అక్కడి నుండి ఆర్డీవో కార్యాలయం చేరుకుని అక్కడ బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలుగు యువత అధ్యక్షులు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఏటా డీఎస్సీ అంటూ నిరుద్యోగుల నోటిలో మట్టి కొట్టారన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో రాణి సుష్మితకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె

● ఎంపీ తలారి రంగయ్య వర్గీయులతో వాగ్వాదం

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 13: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం రెండో రోజు మంగళ వారం కూడా సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీలకే దిక్కులేదు. మరోసారి మోసం చేసి దౌర్జన్యంగా మోటార్లు ఆన్‌చేసి నీళ్లు వదిలేకి వచ్చారా అని వైసీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ తలారి రంగయ్య వర్గీయులు, శ్రీరామిరెడ్డి కార్మికులకు మధ్య వాగ్వాదం జరిగింది. గతంలో హామీలు నెరవేరుస్తామని మాయమాటలు చెప్పి సమ్మెను ఎంపీ విరమించేలా చేశారని మండిపడ్డారు. మొండి బకాయిల కోసం మరోసారి ఆదివారం అర్ధరాత్రి నుండి కార్మికులు పంపుహౌస్‌లో మోటార్లు ఆఫ్ చేసి నిరవధిక సమ్మె బాటపట్టారు. తమకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని సమ్మె చేపట్టారు. రెండో రోజు సమ్మె వద్దకు మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఇతర నాయకులు పోలీసులతో చేరుకుని సమ్మె విరమించాలని బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ నెలాఖరులోగా మీ సమస్యను పరిష్కరిస్తామని వైసీపీ నాయకులు చెప్పడంతో కార్మికులు ససేమిరా అన్నారు. గత నెలలో ఇచ్చిన హామీనే నెరవేర్చలేదు. ఇప్పుడు మరోసారి మోసపూరితమైన హామీలు ఇచ్చేందుకు వచ్చారా అని అసహనం వ్యక్తం చేశారు. చివరికి కార్మికులు సమ్మె విరమించడానికి ససేమిరా అనడంతో కొత్త కాంట్రాక్టర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మోటార్లు ఆన్ చేసి నీటిని వదిలారు. పంపుహౌస్ వద్ద కార్మికులు బయట నుంచి వైసీపీ నాయకులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.


పోలీసుల సమక్షంలో కార్మికులతో మాట్లాడుతున్న నూతన కాంట్రాక్టర్ సుధాకర్ రెడ్డి, వైసీపీ నాయకులు


మోటార్లను ఆన్ చేస్తున్న కాంట్రాక్టర్

చంద్రబాబు పాలనతోనే రాష్ట్రం అభివృద్ధి: జేసీపీఆర్

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 13: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పాలనతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలో ఆయన చేపట్టిన యువచైతన్య బస్సుయాత్ర మంగళవారం ముచ్చుకోట, వరదాయపల్లి, చిక్కేపల్లి, నామనాంకపల్లి, షేక్‌పల్లి, ధర్మాపురం, సోమనపల్లి గ్రామాల మీదుగా సాగింది. ఆయా గ్రామాల్లో జేసీపీఆర్‌కు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జేసీ ప్రభాకర్‌రెడ్డి గ్రామస్థులను పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలన పట్ల ప్రజలు విసిగిపోయారని తెలిపారు. సైకో పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు అతి దగ్గరలో ఉన్నాయన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. బస్సుయాత్రలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి మహిళలతో కలిసి నడుస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, బీసీ నారాయణ, మీసాల నరసింహారెడ్డి, బీసీ రామ కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ముచ్చుకోట టీడీపీ సర్పంచు మహానంది జయమ్మ, మాజీ ఎంపీపీ కూచి సాయి మోహన్, నల్లప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, షెక్షావలి, తలారి క్రిష్టయ్య, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మహిళలతో మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి


మహిళలతో కలిసి నడుస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

రాయదుర్గం, ఫిబ్రవరి 13: రైతులు, కార్మికుల సమస్యలపై తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ సంజీవప్ప పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో ఏపీ ఎన్‌జీఓ భవనంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ దేశవ్యాప్తంగా ఈ నెల 16న తలపెట్టిన సార్వత్రిక సమ్మె కార్యక్రమాన్ని వామపక్ష సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘం, కార్మికుల సంఘాలు కలిసి విజయవంతం చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేయడానికి అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తోందన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు నిరుద్యోగులకు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున, సీపీఎం తాలూకా కార్యదర్శి మల్లికార్జున, ఏఐఎస్ఎఫ్ నాయకుడు కొట్రేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అంజనేయులు, సీపీఐ నాయకులు దుర్గన్న, తిప్పేస్వామి, నరసింహులు, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

విడపనకల్లు, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలోని ఆర్ కొట్టాల రోడ్డు వైపు ఉన్న కాలనీకి చెందిన వడ్డే బసవరాజు(42) మంగళ వారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు బళ్లారి జిల్లా సంఘనకల్లు గ్రామానికి చెందిన వడ్డే బసవ రాజు విడపనకల్లు గ్రామంలో బేల్దారి పనులు చేసుకుని జీవించేవాడు. గత కొన్ని రోజులుగా ఆరోగ్యం సరిగా లేక పోవ టంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఇంటి పై కప్పుకు చీరతో ఉరి వేసుకున్నాడు. బంధువులు గమనించి ఉరవకొండ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి అన్న రాము ఫిర్యాదు మేరకు విడపనకల్లు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వృద్ధురాలిపై దొంగల దాడి

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 13: మండలంలోని ముప్పుల కుంట గ్రామంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు పశువుల తిమ్మక్క అనే వృద్ధురాలిపై దాడి చేశారు. ఆమె కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు.

సత్యకుమార్ పర్యటనను జయప్రదం చేయండి

ఉరవకొండ, ఫిబ్రవరి13: బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి సత్యకుమార్ బుధవారం ఉరవకొండకు వస్తున్న సందర్భంగా ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఆపార్టీ నాయకులు లక్ష్మీనారాయణ, హరి, సిద్ధప్ప పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు నాయకులు కార్యకర్తలను సంసిద్ధం చేయడానికి సత్యకుమార్ పర్యటించనున్నట్లు తెలిపారు. వాల్మీకి కల్యాణ మండపంలో వాల్మీకులతో సమావేశమవుతారన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్తున్నట్లు వాల్మీకి సంఘం నాయకులు సురేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమానికి వాల్మీకులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన వారితో పయ్యావుల శ్రీనివాసులు

కూడేరు, ఫిబ్రవరి 13: మండలంలోని మరుట్ల 2వ కాలనీకి చెందిన 10 కుటుంబాలు మంగళవారం వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. జిల్లా కేంద్రంలో పయ్యావుల శ్రీనివాసుల సమక్షంలో స్కూల్ కమిటీ ఛైర్మన్ శాంతిభూషణ్ రెడ్డి, తిరుపాల్, గోపాల్, సుధాకర్, వేణుచంద్ర, ఓసురప్ప, రామాంజినేయులు,పెద్దన్న, రామాంజినేయులు తదితరులు టీడీపీలో చేరారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

గుత్తి, ఫిబ్రవరి13: క్రీడల్లో క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని రైల్వే ఉద్యోగ కార్మికులకు స్థానిక డీజిల్ షెడ్ డీఎంఈ ప్రమోద్ పేర్కొన్నారు. గుత్తిఆర్ఎస్‌లోని రైల్వే ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులకు కార్మికులకు స్పోర్ట్స్ ఈవెంట్స్‌ను మంగళవారం నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శరీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈవెంట్స్‌లలో రాణించిన రైల్వే ఉద్యోగులకు రైల్వే ఇనిస్టిట్యూట్ ఛైర్మన్, డీఎంఈ ప్రమోద్, ఎస్ఎంఆర్ సురేష్‌బాబు, సీసీసీ అధికారి విశ్వనాథ్, బహుమతులను అందజేశారు.

ఫోర్జరీ సంతకాలతో మహిళా సంఘం సొమ్ము స్వాహా


సంఘం లీడర్, యానిమేటర్ చేసిన అవినీతిని వివరిస్తున్న గీతాంజలి మహిళా సంఘం సభ్యులు

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 13: మండలంలోని విట్లంపల్లికి చెందిన గీతాంజలి మహిళా సంఘం ఖాతాలోని సొమ్మును సంఘం లీడర్, యానిమేట్ స్వాహా చేసినట్లు సంఘం సభ్యులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన మేరకు సంఘంలోని లీడర్, యానిమేటర్ ఇద్దరూ కలిసి ఫోర్జరీ సంతకాలతో రూ.3.35 లక్షల నగదును కాజేశారన్నారు. 2019 సంవత్సరంలో సీసీ లోన్‌కు సంబంధించి రూ. 95 వేలు ఫోర్జరీ సంతకాలు చేసి తీసుకున్నారు. తమకు తెలియకుండానే రూ. 74700 తిరిగి చెల్లించారన్నారు. 2021లో రూ. 9.50 లక్షలు లోన్ మంజూరు కాగా లీడర్, యానిమేటర్‌లు ఇద్దరు కలిసి రూ.1.5 లక్షలు మింగేసినట్లు తెలిపారు. సున్నా వడ్డీ, పావలావడ్డీ వంటి వాటి నగదును కూడా విత్‌డ్రా చేసినట్లు తెలిపారు. దీనిపై ఏపీఎం రామమూర్తిని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వడం లేదన్నారు. ఏపీఎం రామమూర్తి తమకి న్యాయం చేయకుండా దాగుడుమూతలు ఆడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఏపీఎం రామమూర్తికి కూడా వాటాలు ఉన్నాయేమోననే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. సొమ్ము స్వాహాపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

ముత్యాలమ్మ మఠాన్ని ముట్టడించిన హిజ్రాలు

గుంతకల్లు, ఫిబ్రవరి 13: తమపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు మండలంలోని జీ కొట్టాలలోని ముత్యాలమ్మ మఠాన్ని హిజ్రాలు మంగళవారం ముట్టడించారు. మఠాన్ని నిర్వహిస్తున్న గంగరాజు తన వద్దకు వచ్చిన భక్తుల వద్ద హిజ్రాలకు వ్యతిరేకంగా అనుచిత వ్యాఖ్య లు చేశాడు. హిజ్రాలకు డబ్బు ఇవ్వరాదని, ఇస్తే వారిలాగే మీరూ తయారవుతారని, పుట్టే పిల్లలు కూడా అలాగే పుడతారంటూ చెప్పిన వీడియో వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అయ్యింది. దీన్ని చూసిన హిజ్రా లు ఆగ్రహోదగ్రులయ్యారు. ఉదయం ఆటోలలో దాదాపు పాతిక మంది హిజ్రాలు ముత్యాలమ్మ మఠం వద్దకు చేరుకున్నారు. మఠం నిర్వాహకుడు గంగరాజును నిలదీస్తూ గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి తన సిబ్బందితో జీ కొట్టాల గ్రామానికి వెళ్లారు. గొడవపడుతున్న హిజ్రాలను సముదాయించి అక్కడి నుంచి పంపివేశారు. హిజ్రాలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం ఏంటని, వ్యాఖ్యలు చేసిందికాక వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేస్తావా.. అంటూ గంగరాజును మందలించారు. గంగరాజును అదుపులోకి తీసుకుని రూరల్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. హిజ్రాలు రూరల్ పోలీసు స్టేషన్ వద్దకు చేరుకుని తమపై అనవసర వ్యాఖ్యలు చేసిన గంగరాజుపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. పోలీసులు గంగరాజు చేత హిజ్రాలకు క్షమాపణ చెప్పించారు. సమస్య ఏర్పడితే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలే కానీ, ఇలా చేయరాదంటూ సీఐ హిజ్రాలను హెచ్చరించి పంపారు.


గంగరాజును మందలిస్తున్న రూరల్ సీఐ మహేశ్వర రెడ్డి

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ


అమ్మవారిని దర్శించుకుంటున్న కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో మంగళవారం నూతనంగా నిర్మించిన ఆలయంలో మూడు ముఖలమ్మ అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. మూడురోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాల అనంతరం ఈ కార్యక్రమం పూర్తి చేశారు. అంతకు ముందు ఆలయంలో విఘ్నేశ్వరపూజ, ఇతర పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠ అనంతరం కుంభాభిషేకం, మహాపూర్ణాహుతితో పాటు పలు పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు సమీప గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ప్రతిష్ఠలో పాల్గొన్నారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి మల్లికార్జున, కుమ్మరి మల్లికార్జున, తిమ్మరాజు, పయ్యావుల నాగరాజు, మహేంద్ర, పయ్యావుల మోహన్, హనుమంతప్ప, సంగప్ప, సైకిల్‌షాప్ హనుమంతు, బసప్ప, రవిచంద్ర, రమేష్ పాల్గొన్నారు.

రోడ్డుపైనే ఆసరా సభ


ఎన్టీఆర్ విగ్రహం ఎదురుగా రోడ్డుపైన వాహనాలు వెళ్లకుండా అడ్డంపెట్టిన బారికేడ్లు

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 13: పట్టణంలోని కూరగాయల మార్కెట్ నడి రోడ్డుపై వైఎస్ఆర్ ఆసరా సభను మంగళవారం సాయంత్రం నిర్వహించారు. వైఎస్ఆర్ ఆసరా 4వ విడత పొదుపు సంఘాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించా రు. మధ్యాహ్నం 4గంటలకు ప్రారంభమయ్యే సభకు ఉదయం 10గంటల నుంచి మెయిన్ రోడ్డులో ఉన్న ఇరువైపులా షాపులను బంద్ చేయించారు. ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు, కూరగాయల మార్కెట్ వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సభలో మాజీమంత్రి శంకరనారాయణ మాట్లాడుతుండగా సభ స్టేజ్ పక్కన నుంచి మహిళలు బయటకు వెళ్లి పోయారు. గమనించిన మెప్మా సిబ్బంది, వైసీపీ నాయకులు, పోలీసులు మహిళలు వెళ్లకుండా ద్విచక్రవాహనాలను అడ్డం పెట్టారు. ఆసరా కార్యక్రమా నికి ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్ భవానీ, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, మెప్మా ప్రాజెక్ట్ అధికారి మోహన్ హాజరయ్యారు. 1335 గ్రూపులు, 13022 మంది సభ్యులకు రూ. 9.37కోట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రూప్ సభ్యులకు చెక్కులను అందజేశారు.

నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్-2లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 13: దేశవ్యాప్తంగా గత ఏడాది డిసెంబరు19న నిర్వహించిన నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్-2లో కాట్ ఒలింపియాడ్ ఫలితాల్లో పట్టణంలోని రాజేంద్రనగర్‌లోని చైతన్యపాఠశాల-1 విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వీరేష్‌బాబు మంగళవారం తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు బంగారు పతకాలు, సర్టిఫికెట్లు, నగదు బహుమతులను సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చైతన్య విద్యా సంస్థల జిల్లా ఏజీఎం సుబ్బారెడ్డి, డీన్ జాన్‌విన్సెంట్ అభినందించినట్లు తెలిపారు.

వాటర్‌షెడ్ పథకం పనులపై సామాజిక తనిఖీ

రాయదుర్గం, ఫిబ్రవరి 13: రాయదుర్గం నియోజకవర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వాటర్‌షెడ్ పథకానికి ఎంపికైన గ్రామాలలో ఇప్పటివరకు నిర్వహించిన పనులకు సామాజిక తనిఖీ చేస్తున్నట్లు వాటర్‌షెడ్ పీఓ శ్రీవిద్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళ్యాణదుర్గం డివిజన్‌లోని బోరంపల్లిలో ఈ నెల 20న రెండు గ్రామాలలో వాటర్‌షెడ్ తనిఖీ అనంతరం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాయదుర్గం మండలం గ్రామదట్ల రూ. 78.21 లక్షలు, టీ వీరాపురంలో రూ. 92.83 లక్షలు, కొండాపురంలో రూ. 1.36 కోట్లు మొత్తం మూడు గ్రామాలలో 27 పనులకుగాను గ్రామంలో రూ. 3.07 కోట్లతో నిర్వహించిన పనులకు ఈ నెల 20న తనిఖీలు నిర్వహించి గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి: జేసీ

ఉరవకొండ,ఫిబ్రవరి13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్‌రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జేసీ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్‌రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆయన మంగళ వారం పరిశీలించారు. ఎన్నికల ముందస్తు ఏర్పాట్లపైన చర్చించారు. అధికారులకు తగు సూచనలు చేశారు. తహసీల్దారు కార్యాలయంలో నోడల్ అధికారులతో జేసీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఆర్వో శిరీష, డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో అమృత్ రాజ్ పాల్గొన్నారు.

హాస్టల్లో ఒక్కరూ లేరా ?

65 మంది ఉండాల్సిన చోట ఒక్కరూ కానరాని వైనం


ఎవరూ లేకపోవడంతో మూతబడిన హాస్టల్ గదులు

బెళుగుప్ప, ఫిబ్రవరి 13: స్థానిక ప్రభుత్వ బాలుర వసతి గృహం అధికారుల పర్యవేక్షణలోపంతో అస్తవ్యస్తంగా మారింది. రాత్రి 7.30 గంటలకు విలేకరుల వెళ్లి పరిశీలించగా ఈ వసతిగృహంలో ఒక్క విద్యార్థి కూడా కనిపించలేదు. ఈ వసతి గృహంలో 65 మంది విద్యార్థులు వున్నట్లు వార్డెన్ చెబుతుండగా గదులన్నీ మూతబడ్డాయి. విద్యార్థులేరి అని వంట సిబ్బందిని అడగ్గా భోజనం ముగించుకుని వెళ్లిపోయారన్నారు. స్థానికంగా వార్డెన్ ఉండటం లేదు. కనీస సౌకర్యాలు కూడా లేవు. స్నానపు గదులు, మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. రూముల్లో లైట్స్ కూడా లేవు. ఈ విషయమై వార్డెన్ నాగరాజును వివరణ కోరగా విద్యార్థులు బయటకి వెళ్లారని, వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కుష్ఠుపై అవగాహన అవసరం: వైద్యాధికారి

పామిడి, ఫిబ్రవరి 13: ప్రజలకు కుష్ఠువ్యాధిపై అవగాహన ఎంతో అవసరమని లెప్రసీ డిప్యూటీ పార మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పట్టణంలోని సీహెచ్‌సీలో మంగళవారం కుష్ఠు బాధితులకు చెప్పులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శలేనిమచ్చ, ముఖము, చెవులు, ఎద, వీపు మీద నొప్పిలేని బుడిపెలు, కనురెప్పలు, కనుబొమ్మలు రాలిపోవుట, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, వాపులు, ముక్కుదూలం అణిగిపోవుట, గాలి ఆడకపోవుట, కాలి వేళ్ల నేలకు రాసుకోవడం, పాదాలు, చేతులపై బొబ్బలురావటం వంటివి కుష్ఠువ్యాధి లక్షణాలన్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించుటకు 3-5 సంవత్సరాలు పడుతుందన్నారు. తుమ్మడం, దగ్గడం వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. వైద్యునిచే వ్యాధి నిర్ధారణ అయిన మొదటి నెల నుంచి(మల్టీ డ్రగ్ థెరపీ) ఎండీటీ మందులు ప్రభుత్వం పూర్తిగా అందజేస్తుందన్నారు. క్రమం తప్పకుండా వాడడం వల్ల ఈ వ్యాధి నయం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎల్లప్ప, ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యులు సుధాకర్, ఉదయార్క్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీరాములు, ఆరోగ్య మిత్ర అమర్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.